# భక్తజన సంద్రంగా హనుమాన్ ఆలయం


సిర్పూర్(టీ)లో పాదయాత్రకు తరలి వస్తున్న భక్తులు

- మహా పాదయాత్రలో వేలాదిగా పాల్గొన్న భక్తులు
- బందోబస్తును పరిశీలించిన కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్
- దారులన్నీ టోంకిని వైపే

సిర్పూర్(టీ), నవంబర్ 21 : మండలంలోని టోంకిని గ్రామంలోని శ్రీ సిద్ధి టోంకిని హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 22వ హనుమాన్ మహాపాదయాత్ర భక్తజన సంద్రంగా మారింది. ప్రతి సంవత్సరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాపాదయాత్రకు జిల్లాలోని పలు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవడంతో టోంకిని ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కాగజ్‌నగర్ పట్టణం నుంచి ప్రారంభమైన పాదయాత్రలో కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం, ఇతర గ్రామాలతో పాటు సిర్పూర్(టీ) మండలంలోని వేంపల్లి, పెద్దబండ, సిర్పూర్(టీ)తో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాదయాత్రలో పాల్గొన్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచే ప్రారంభమైన పాదయాత్ర మధ్యాహ్నం వరకు కొనసాగింది. కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టీ), టోంకిని వరకు పాదయాత్రగా వస్తున్న భక్తులకు కొందరు భక్తులు పండ్లు, ఫలహారాలతో పాటు చాయ్‌ని అందించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న భక్తులు లైన్‌లలో వేచియుండి దైవ దర్శనం చేసుకున్నారు. టోంకిని ఆలయంలో అధికారులు, ప్రముఖ రాజకీయ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**• భారీ పోలీసు బందోబస్తు...**

కాగజ్‌నగర్ పట్టణం నుంచి మహాపాదయాత్రగా వస్తున్న భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలుగకుండా కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. టోంకిని మహాపాదయాత్రలో భాగంగా టోంకిని ఆలయాన్ని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ సందర్శించి, బందోబస్తును పరిశీలించారు. కాగజ్నగర్ సీఐ నాగరాజు, కౌటల సీఐ సాధిక్ పాషా, సిర్పూర్(టీ) ఎస్ఐ దీకొండ రమేశ్, ఇతర మండలాల ఎస్ఐలు ఉన్నారు.

**• భక్తులకు అన్నదానం..**

టోంకిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో టోంకిని మహాపాదయాత్రకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా వేంపల్లిలో కోనేరు చారిటెబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాదం పాలు, కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టీ) మీదుగా టోంకిని వరకు భక్తులకు ఏలాం టి అసౌకర్యాలు కలగకుండా పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు, యువకులు స్వచ్ఛందంగా పండ్లు, మజ్జిగ, పాలు, చాయ్‌లు పంపిణీ చేశారు.


భక్తులతో కిటకిటలాడుతున్న టోంకిని ఆలయం


టోంకిని హనుమాన్‌ను దర్శించుకుంటున్న భక్తులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓయూ జేఏసీ నాయకుడు పెద్దమ్మ రమేశ్

# మా మద్దతు బాల్క సుమన్‌కే

- ఓయూ జేఏసీ నాయకుడు రమేశ్

చెన్నూర్, నవంబర్ 21: తెలంగాణ విద్యార్థి ఉద్యమనాయకుడు, చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కే ఉస్మానియా యూనివర్సిటీ అన్ని విద్యార్థి సంఘాల మద్దతు ప్రకటించాయని ఓయూ జేఏసీ నాయకుడు పెద్దమ్మ రమేశ్ తెలిపారు. చెన్నూర్‌లోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ, బాల్క సుమన్ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ప్రత్యామ్నాయ పోరాటాన్ని నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలు అర్పించటానికి సిద్ధపడి అనేక ఉద్యమాలు చేసిన నాయకుడన్నారు. తెలంగాణ ఉద్యమంలో మిలయన్ మార్చ్ జరిగితే హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ మీద కవాత్ నిర్వహించి జైలుపాలయ్యారని ఆయన తెలిపారు. తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటంలో అనేక లాఠీ దెబ్బలు తిని ఉద్యమంలో ముందు నడిచారే తప్పా ఏనాడు వెనకడుగు వేయలేదన్నారు. అలాంటి విజన్ కలిగిన నాయకుడు బాల్క సుమన్ అతి తక్కువ కాలంలోనే చెన్నూర్ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఆయన తెలిపారు. గతంలో తాము 2018లో విద్యార్థి నాయకులుగా ఇక్కడికి వచ్చామని, ప్రస్తుతం ఇప్పుడు వచ్చామని, అప్పటికీ ఇప్పటికీ ఎంతో మార్పు కనిపిస్తుందన్నారు. బాల్క సుమన్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నిరుపేద విద్యార్థులు ఎంబీబీఎస్ లాంటి ఉన్నత చదువుల్లో సీట్లు పొందగా వారికి ఆర్థిక సహాయం అందించారని ఆయన తెలిపారు. అయితే నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక ఏనాడు ఉద్యమంలో లేని, ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధం లేని, కొంత మంది వ్యక్తులు ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ పేరు చెప్పి చెన్నూర్‌కు వచ్చి బాల్క సుమన్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన తెలిపారు. వారి అసత్య ఆరోపణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు సాగాలంటే బాల్క సుమన్‌తోనే సాధ్యమన్నారు. రానునన ఎన్నికల్లో మంచి విజన్ ఉన్న నాయకుడు బాల్క సుమన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు బొందరి శశిపాల్, మేకల రవి, అమీర్‌శెట్టి ప్రవీణ్, బొగిని సాయికృష్ణ, ప్రవీణ్, శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలి


కాసిపేట : అవగాహన కల్పిస్తున్న కాసిపేట ఎస్ఐ గంగారాం

కాసిపేట, నవంబర్ 21 : ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కాసిపేట ఎస్ఐ గంగారాం సూచించారు. మంగళవారం కాసిపేట మండలంలోని కోమటిచేను గ్రామంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గంగారాం మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా పోలీసులు సేవ చేసేందుకు అందుబాటులో ఉంటారని, ఏ సమస్య ఉన్నా వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఓటు అనేది ప్రజల హక్కు అని, నిర్భయంగా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఓటరు స్లిప్పుల పంపిణీ

తాండూర్, నవంబర్ 21 : అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా వారి పోలింగ్ కేంద్రం, బూత్‌ల వివరాలతో కూడిన ఓటరు స్లిప్‌లను ఆయా గ్రామాలలో ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో బీఎల్వోలు మంగళవారం పంపిణీ చేశారు. ఓటర్ స్లిప్‌లతో పాటు ఓటింగ్ విధానంపై పలు సమాచారాన్ని అందిస్తున్నారు. మండల కేంద్రంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాలను, ఓటర్ స్లిప్‌ల పంపిణీని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలో ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.


తాండూర్‌లో ఓటర్ స్లిప్ పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

# సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి


- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు


సూక్ష్మ పరిశీలకుల రాండమైజేషన్ ప్రక్రియను వివరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే

ఆసిఫాబాద్ టౌన్,నవంబర్ 21:అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం సూక్ష్మ పరిశీలకుల రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహివాల్, పోలీస్ పరిశీలకులు డీకే దరి, జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ తో కలిసి సూక్ష్మ పరిశీలకుల రాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 001-సిర్పూర్, 005-ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఈనెల 30వ తేదీన జరగనున్న పోలింగ్ సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పూర్తిస్థాయి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సిర్పూర్ నియోజకవర్గంలోని 42 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు 43 మంది, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని 39 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు 39 మంది నియమించామని తెలిపారు. పోలింగ్ రోజున సూక్ష్మ పరిశీలకులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ తీరును నివేదిక రూపంలో అందిస్తారని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రెండో ర్యాండమైజేషన్ పూర్తి**

ఆసిఫాబాద్ టౌన్,నవంబర్ 21:శాసనసభ నియోజకవర్గ ఎన్నికలలో భాగంగా ఈ నెల 30న జరుగనున్న పోలింగ్ సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల 2వ రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 005-ఆసిఫాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాహుల్ మహివాల్, ఆసిఫాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దాసరి వేణుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల 2వ రాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో జిల్లాలోని 005-ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన 305 పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వి వి ప్యాట్ల 2వ విడత కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల 2వ రాండమైజేషన్ ప్రక్రియను వివరిస్తున్న రిటర్నింగ్ అధికారి దాసరి వేణు